# బంధాలు

కరుణ అప్పుడే ఇంటికి వచ్చింది.

గోపాల్ అరగంట ముందే వచ్చాడు. గేటు చప్పుడుకి అటువైపు చూశాడు. ఒక చేతిలో పుస్తకాలు, రెండవ చేత్తో జుట్టు సవరించుకుంటోంది కరుణ. దట్టమైన మబ్బుల మధ్య మెరుపులా మనసులో సంతోషం ఒక్క వెలుగు వెలిగింది అంతలోనే ఒక ఆవేశం పాల పొంగులా పైకి ఒలకబోయింది. మళ్ళీ ఎక్కడ నుంచో నీళ్ళు పడ్డట్టు అణగారి పోయి మనసు అడుగున ఒదిగిపోయింది.

గోపాల్‌ని గమనించిన కరుణ కళ్ళు చిన్నగా నవ్వాయి.

గట్టిగా అరవాలనుకున్నాడో, మరింత గట్టిగా కౌగలించుకోవా లనుకున్నాడో, ఏవో ఎన్నో బాధలు ఏకరువు పెట్టా లనుకున్నాడో అతడికే తెలీటంలేదు.

ఎక్కడనుంచి వచ్చిపడ్డాయి నీళ్ళు?

ఎప్పుడూ అంతే. అతడు ఆవేశ పడతాడు. వెంటనే ఎక్కడనుంచో నీళ్ళు చిలకరిస్తాయి. అదేమిటో?

కరుణ నవ్వా?

దగ్గరగా వచ్చింది కరుణ.

కరుణ భుజాల మీద పొట్టిగా కత్తిరించిన జుట్టు అలల్లాగ కదులుతోంది. వింతకాంతులీనుతోంది.

అతణ్ణే చూస్తూనే తల కొంచెం ఎగరేసింది. సగం నవ్వింది.

''కాఫీ తాగేశారా?'' అంది.

హు...కాఫీ కూడానూ...

''పాలు విరిగిపోయాయి'' అన్నాడు.

అంటుంటే ఏడుపు వచ్చినట్లయింది.

చేతిలో ఉన్న పుస్తకాల కట్ట బల్ల మీద పడేసి వచ్చింది. అతడి పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంది కరుణ.

''ఇవేళ ఏమైందనుకున్నారూ...'' అంది.

అప్రయత్నంగా కరుణ కళ్ళలోకి చూశాడు.

ఆ కళ్ళలో జాలి, జాలి కెరటం కాదు. అది నదో, సముద్రమో?

''ఆ మనసు ఇక్కడ లేదు.'' అనుకుని అతడి మనసు మూలిగింది.

''ఏమైంది'' అని అతడు అడగలేదు. కరుణ చెప్పటం మొదలు పెట్టింది.

''ఇవేళ సెకండ్ పీరియడ్ అయ్యాక ఎనిమిదో తరగతికి వెడుతున్నాను. వనజ ఎదురు వచ్చింది. కుంటుతోంది. కాలికేమయిందని అడిగాను. తనని ఎప్పుడూ క్లాసులో చూడటం తప్ప బయట చూడలేదు. ఎంతో తెలివైంది. శ్రద్ధగా వింటుంది పాఠాలు. నా మొహంలోకి చూసింది, తల వంచుకుంది.

''నేనింతేనండీ. ఇట్లాగే నడుస్తాను. పోలియో వచ్చింది'' అంది.

ఆ పిల్ల మొహంలో విచారం లేదు. అలవాటుపడి ఉంటుంది కానీ నేను తెల్లబోయాను. ఎంతో బాధ వేసింది.

ఆ పిల్ల నవ్వి వెళ్ళిపోయింది కానీ నేను కొంచెం సేపు అక్కడే నిలబడిపోయాను. వనజకి ధైర్యం చెప్పాలి. బాధ పడిందేమో మొహంమీద అడిగేశాను, ఊరడించాలి. ఆ పిల్లకి దగ్గరవాలి ఆత్మవిశ్వాసం కలిగించాలి!

ఒక లోపం, శారీరిక లోపంతో ఆడపిల్ల బ్రతకటం ఎంత కష్టం!

ఆ పిల్లకి పెళ్ళవుతుందా? పెళ్ళయినా సవ్యంగా రోజులు గడుస్తాయా? అన్నీ సమంగా ఉంటేనే జీవితం సాఫీగా గడవదు కదా...

వనజని ఈ శనివారం మన ఇంటికి రమ్మన్నాను...

చెప్పటం మధ్యలో ఆపింది కరుణ.

''అన్నట్లు ఆలస్యంగా వచ్చాను ఇవేళ...మీకు కోపం వచ్చిందా? లేదు కదూ? రజని కూతురు పుట్టిన రోజు ఇవేళ.... ఏడిచింది. పాపం! తనతో వెళ్ళి వాళ్ళింట్లో ఒక గంట కూర్చున్నాను. అన్నట్లు రజని సంగతి మీకు తెలీదు కదూ.

వాళ్ల పెళ్ళయి పదేళ్ళయింది. ఒక కూతురు పుట్టింది. తాగుతాడట. ఇంటి అవసరాలకి డబ్బు లేకపోయినా అవి మానడట. బతిమిలాడినా వినిపించుకో లేదుట. పైగా కోపంతో అసహ్యించుకుని ఇంకొకావిడతో స్నేహం చేశాడట! సహించలేక వచ్చేసింది రజని. ఏమిటో ఈ బంధాలనిపిస్తుంది. వాటిలో ఒదగలేము. వాటికి అతీతులమూ కాలేము. అతడు పంతం కొద్దీ కూతుర్ని తన దగ్గరే ఉంచుకున్నాడుట. అతడికైతే దూరం కాగలిగింది కానీ కూతురి ప్రేమ చంపుకోలేదు కదా. ఇవేళ ఫ్రాక్ కొంది ముప్పై రూపాయలు పెట్టి. ఏం చేసుకుంటుంది, పెట్టెలో పెట్టుకుంది. స్వీట్స్ కొని పిల్లలకి పంచింది.

నేను వెళ్ళి కూర్చున్నాను. ఈ సంగతు లన్నీ చెప్పింది. గుండె బరువు దించుకుంది. మమతలకి దూరమైతే జీవితానికి అర్థం పోతుంది. మనసు దేనికో ఒక దానికి అల్లుకుపోవటానికి సిద్ధపడుతుంది. అల్లుకోకుండా ఉండలేదు. పిచ్చి రజని...నేను వచ్చేస్తుంటే 'నీ స్నేహం లేకపోతే నేనేమైపోతానో?' అంది.

గ్లాసు అందుకుని మిగిలిన నీళ్ళు గడగడా తాగేశాడు గోపాల్.

కథలు, కథలు, కథలు. ఎవరివో కథలు! ఎన్నో కథలు!

కొన్ని మాటలే చెవుల్లో పడుతున్నాయ్, కొన్ని బాణాల్లాగ గుచ్చు కుంటున్నాయి. కొన్ని వేడిగా కాలుస్తున్నట్లుగా ఉన్నాయ్.

''అయ్యాయా నీ కథలు?'' అరవాలనుకున్నాడు.

అరిచానా అనుకున్నాడు.

ఊహు లేదు. అరవలేదు.

నీళ్ళు! నీళ్ళు చల్లేశారెవరో, ఎక్కడినుంచో.

కరుణ కళ్ళలోనుంచా?

కాదు, తన మనసులోనే, తలలోనే ఎవరో నీళ్ళు పట్టుకుని నుంచున్నారు సిద్ధంగా. చల్లేశారు తను అరవకముందే.

కరుణ కళ్ళలోకి చూశాడు. గోపాల్.

''నేనొక కథ చెప్పనా?'' అన్నాడు.

''మీరా! కథా! మీరు కథ చెప్పగలరా?'' అన్నట్లు వింతగా చూసింది. కరుణ.

కరుణ 'ఊ' అనకుండానే ప్రారంభించాడు.

పదేళ్ళ క్రిందట!

ఒక చాలా మంచి అబ్బాయి ఉన్నాడు.

తెలిసిన వాళ్ళ కుటుంబంలో ఒక అమ్మాయి ఉంది.

ఆ అమ్మాయి అతడికి చాలా నచ్చింది.

పొడుగుజడ, కోలమొహం, సోగకళ్ళు...మాట్లాడేకళ్ళు పాటలు పాడే కళ్ళు, నవ్వే కళ్ళు! ఆ అమ్మాయి బాగా చదువుకుంది. తెల్లివైంది. అబ్బాయి కట్నం వద్దన్నాడు. అమ్మాయికి కూడా అబ్బాయి నచ్చాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు... బాగున్నాడు.

పెళ్ళయింది!

ఆ అమ్మాయి ఏం అడిగినా 'కాదు' అనటం చేతకాదు.

అది ఆ అమ్మాయి మహాత్మ్యం, ఆ కళ్ళ ప్రభావం!

అయినా అతడేమీ నష్టపోలేదు.

వాళ్ళకి ఇద్దరు పిల్లలు పుట్టారు. పెద్దవాళ్ళయ్యారు.

ఆ అమ్మాయి కళ్ళలో ప్రభావం ఎక్కువైంది. మహాత్మ్యం ఎక్కువైంది. చీరలు అడగటం మానేసింది, పుట్టిన రోజు మరిచిపోయాడని అలగటం మరిచి పోయింది.

జుట్టు కత్తిరించుకుంది. ఆధునికత సంతరించుకుంది. పిల్లల్ని స్కూల్లో వేసింది...తనూ స్కూల్లో చేరింది.

పిల్లల్ని చూస్తే జాలి; ఆరాధన!

చిన్నచిన్నవాళ్ళు, పూలలా సుకుమారులు.

వికసించే సైంటిస్టులు...అన్వేషించే ఆత్మలు.

అది పెద్ద రకరకాల అద్భుతమైన పూలతోట.

ఆ అమ్మాయికి ఎవరిని చూసినా జాలి.

హెడ్‌మిస్ట్రెస్‌కి పెళ్ళి కాలేదు. నలభై ఏళ్ళు వచ్చినా జీవన రాగం వినలేదని జాలి.

ఒక టీచర్ భర్త వదిలేశాడు...అనారోగ్య కారణంగా.

ఒకావిడ భర్త రోగిష్టి.

ఒకావిడ విడో...ఒంటరిగా గడపాలి రాత్రీ పగలూ!

ఆ అమ్మాయికి అందరిమీదా జాలి.

పక్క ఇంట్లో బ్రహ్మచారి జబ్బు పడితే సేవ చేసింది.

భర్త స్నేహితుడికి భార్య పోతే స్నేహం చేసింది.

దానికి కూడా ఆ అబ్బాయి బాధ పడలేదు.

ఆ జాలిలో అమ్మాయి తనను తాను మరిచిపోయింది.

ఆ అబ్బాయిని, తను పెళ్ళి చేసుకున్నవాడిని మరిచిపోయింది.

అతడు పొద్దున్నే పనిలోకి వెడతాడు.

సాయంత్రానికి అలసిపోయి వస్తాడు.

ఇంటికి రాగానే అమ్మాయి ఉండదు. ఒక్క చిరునవ్వు దొరకదు. కాఫీ ఉండదు...పాలు విరిగిపోతాయి.

ఉండేది రుచిలేని భోజనం, అలసిపోయిన పిల్లలూ...

ఆటల సందడిలో అన్నీ మరిచిపోతారు పిల్లలు.

వాళ్ళకి బిస్కెట్లూ బిళ్ళలూ చాలు.

ఎట్లాగో ఒకలాగ భోజనం అయిన తరవాత నోట్సులు దిద్దటం, ఏవో పనులు...అలసిపోయి నిద్రపోతుంది అమ్మాయి.

ఆ అబ్బాయికి నిద్ర రాదు.

ఆఫీసులో 'స్టెనో' గుర్తువస్తుంది. ఆవిడ చిరునవ్వూ, కాఫీ తాగుతూ చూసిన చూపులూ, విసిరిన మాటలూ గుర్తువస్తాయి...ఏదో కావాలనిపిస్తుంది.

లేచి షర్ట్ తొడుక్కుంటాడు. చెప్పులు తొడుక్కుంటుంటే...ఇంతలో ఎక్కడనుంచో నీళ్ళు పడతాయి.

అతడిలో ఆవేశం, కోరికా అణిగిపోతాయి.

వెనక్కి తిరిగి వస్తాడు.

పడుకుని నిద్రపోతున్న అమ్మాయిని చూస్తూ నిలబడిపోతాడు.

''నో, నో...అతడు అట్లాగ ఊరుకోకూడదు. జాలి, ప్రేమ, ఉత్సాహం ఆపుకోకూడదు. అవే జీవితానికి విలువైన వరాలు.

షీ ఈజ్ ఎ ఫూల్...ఆ అమ్మాయిని వదిలిపెడితే తప్పు లేదు. ఆ అమ్మాయి తృప్తి ఆ అమ్మాయికి ఉంది. అతను స్టెనో దగ్గిరకి వెళ్ళాల్సిందే!...'' ఆవేశంగా అంది కరుణ.

కరుణ కళ్ళలోకి చూస్తున్నాడు గోపాల్. అవి మిలమిలా, అందంగా ముత్యాలలాగ మెరుస్తున్నాయి.

''కానీ ఆ అమ్మాయి పేరు కరుణ!'' అన్నాడు గోపాల్ శక్తినంతటినీ కూడదీసుకుంటూ.

''కరుణ'' అని నిశ్శబ్దంగా ఉచ్చరించాయి కరుణ పెదవులు.

లేచి అతడికి దగ్గరగా వచ్చి నిలబడింది కరుణ, అతడి జుట్టు సవరిస్తూ.

''ఉండండి, కాఫీ తాగుదాం'' అంది.

పనిమనిషిని పిలిచి పాలు తెప్పించింది.

నీళ్ళు కాచి డికాషన్ తీసింది. పాలు కాచి కాఫీ కలిపింది.

మధ్యలో రెండుసార్లు అతడిని చూసి నవ్వింది.

చిక్కగా, వేడిగా కమ్మగా ఉంది కాఫీ.

తాగుతున్నారు.

''నేను బాగా సంపాదిస్తున్నాను– అని అహం నాకు లేదు. మనకి బాగానే గడిచిపోతోంది. నువ్వు ఈ ఉద్యోగం మానెయ్యరాదా కరుణా. పిల్లలు కూడా నీకోసం....నువ్వు ఇంట్లో ఉండకపోతే...'' అని మొదలుపెట్టాడు గోపాల్.

''వాళ్ళు పెద్దవాళ్ళయ్యారు. ఏం ఫరవాలేదు. నన్ను వదిలి వాళ్ళకి కావలసినవి ప్రపంచంలో వెతుక్కునే వయసు వస్తోంది. నేను...నేను...ఉద్యోగం వదులుకోలేను. అది నేనే ప్రయత్నించాను. కానీ నాకు సాధ్యం కాలేదు. స్కూలికి వెళ్ళకుండా...

నిర్మల, రజని, కల్యాణి...పిల్లలూ...వాళ్ళతో కలిసి నవ్వకుండా, వాళ్ళ మాటలు వినకుండా వాళ్ళందర్నీ వదిలి ఇంట్లో ఒంటరిగా పరుపు మీద దొర్లుతూ...ఉహూ మళ్ళీ ఆ రోజులు నేను కోరుకోవటం లేదు.

నాకు సగం ప్రపంచం స్కూలు, సగం ప్రపంచం మీరు. సగం తృప్తి స్కూల్లో వస్తుంది.

రెండవ సగం తృప్తిగానే ఉందనుకున్నాను. కానీ లేదు. నా రెండవ సగం కూడా అసంతృప్తి పడకూడదు. మీరు సంతోషంగా ఉండాలి. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలి. సంతోషం రకరకాలుగా ఉంటుంది. దానికోసం ఎక్కడికైనా వెళ్ళండి. జయ దగ్గరికి వెళ్ళండి. షి ఈజ్ ఎ నైస్ గరల్. మీకు నిజంగా తృప్తి దొరికితే...నాకూ తృప్తే. మీ ఆరోగ్యానికి భంగం రానంత వరకూ మీరు ఏ విధంగా సంతోషం పొందినా నాకు అభ్యంతరం లేదు...సంతోషమే'' అంది కరుణ.

కరుణ జుట్టును చేతిలోనికి తీసుకున్నాడు. పలచగా జారిపోతూ మెరుస్తున్నాయి వెంట్రుకలు.

''నీకు అభ్యంతరం లేదు! కానీ జయ దగ్గిరకి వెడితే నాకు మనశ్శాంతి ఉండదు. మనశ్శాంతి పోతే ఆరోగ్యం చెడిపోతుంది. లాభం లేదు'' అన్నాడు గోపాల్ కరుణ కళ్ళలోకి చూస్తూ.

ఆ కళ్ళలోంచి అతడి మీద జాలి వర్షం కురుస్తోంది ఆ కళ్ళలోనే జాలి తెరల మధ్య కాఠిన్యం కూడా ఉంది.

ఆ కాఠిన్యం క్రమంగా కరిగిపోతోంది.

అతడి మనసు మీద నీళ్ళు చల్లగా పారుతున్నాయి. కరుణ భుజాలను చుడుతూ చెయ్యి వేశాడు గోపాల్.

''ఇది చాలు కరుణా! రోజుకి ఒక గంట నువ్వు ఇల్లాగ ఉంటే చాలు నాకు'' అన్నాడు.

అతడి భుజం మీద తల ఆనించింది కరుణ.

''అందుకే మీరంటే నాకిష్టం. అట్లాగే నా రెండవ సూన్ని కూడా సంతోషంగా ఉంచుకోవాలి కదా నేను మాత్రం!'' అంది కరుణ.

పూల వనంలో తిరుగుతున్నట్లు, జలపాతాలు చూస్తున్నట్లు ఆకాశంలో ఎత్తుగా రెక్కలు చాపి ఎగురుతున్నట్లు అతడి మనసు విభ్రమం పొందుతోంది.

* * * *